## సదుంలో ఏజంట్ల కిడ్నాప్ కలకలం

తిరుపతి, మే 13 ప్రభాతవార్త

సదుం మండలంలో సోమవారం సార్వత్రికఎన్నికల సందర్భంగా కిడ్నాప్ కల కలం సృష్టించింది. ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించేందుకు 4.30 గంటలకు బూరగమంద పంచాయతీకి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీకి చెందిన ఏజంట్లు బయలుదేరి పోలింగ్ కేంద్రంవద్దకు రాగా అక్కడ మాటు వేసి ఉన్న వైకాపా నాయకులు 9 మందిని వాహనాలలో ఎక్కించుకుని వెళ్లిపోయారు. దీనిపై అక్కడే ఉన్న పలువురు తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా బాబుకు సమా చారం ఇచ్చారు. ఆయన ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగడంతో వారిని పీలేరులో వదిలివెళ్లిపోయారు. కిడ్నాప్‌కుగురయినవారిలో రాజారెడ్డి, కిషోర్, సుబ్బరాజు, ఉదయ్, సురేంద్ర తదితరులు ఉన్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ షన్మోహన్ కిడ్నాప్ అయిన వారిని వారి స్వగ్రామాలకు చేర్చినట్లు ప్రకటించగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా స్పందించి కిడ్నాపైన వారిని గుర్తించి వెంటనే విధులకు హాజరుపరచినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమకు ఎటువంటి సంబంధం లేదని పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రకటించారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## పోలింగ్ సరళి పర్యవేక్షించిన కలెక్టర్



చిత్తూరు, మే 13 ప్రభాతవార్త: జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షించారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ మేరకు జిల్లాలో పోలింగ్ జరుగుతున్న తీరును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలులు కమాండ్ కంట్రోల్ రూమ్ చేరుకొని అక్కడి నుండి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పోలింగ్ తీరును పర్యవేక్షిస్తూ పోలింగ్ కేంద్రాల్లోని అధికారులు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

### ఉత్సాహంగా

# ఓటేసిన ఓటర్లు

**తిరుపతిలో 52.4శాతం పోలింగ్**

**దొంగ ఓట్లతో వైసిపి కార్యకర్తలు దూకుడు**

**భద్రత దళాలకు పట్టుబడిన దొంగ ఓటర్లు**

**భారీ భద్రత నడుమ ఓటు ప్రశాంతం**



తిరుపతి,మే 13ప్రభాతవార్తన్యూస్‌నెట్‌వర్క్: అంతా అనుకున్నట్లే తిరుపతి నియోజకవర్గంలో సోమవారం ఉదయం ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం 6గంటలకే అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు కలిగిన ఓటర్లు క్యూలైన్లలో నిలబడ్డారు. ఉదయం నుండి సాయంత్రం వరకు 250 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటు వేశారు. తిరుపతినగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లు వేసేందుకు వైసిపి అభిమానులుగా, కార్యకర్తలుగా పలువురు రావడంతో వారిని భద్రత దళాలు పట్టుకుని చర్యలు తీసుకున్నారు. దొంగ ఓటర్లను అడ్డుకునేందుకు టిడిపి,బిజెపి,జనసేన పార్టీల కూటమి నేతలు కూడా ఒకఅడగు ముందుకేసి సిద్దంగా ఉండటంతో దొంగ ఓట్లను నియంత్రించగలిగారు. సాయంత్రం 6గంటల వరకు తిరుపతి అసెంబ్లీలో 52.4శాతం పోలింగ్ నమోదైంది. తిరుపతి అసెంబ్లీనియోజకవర్గంలో 3,02,503మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 6గంటల వరకు దాదాపు 53శాతం పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. కొత్తగా తమ ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్లు 6,460మంది ఉన్నారు. వీరంతా కూడా ఉత్సాహంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సిసికెమెరాలు ,పోలీసు బలగాలు పటిష్టంగా విధులు నిర్వహించారు. తిరుపతిలోని మధురానగర్ సెవెన్‌హిల్స్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఈవిఎం గంటపాటు మొరాయించింది. పలుచోట్ల తాగునీరు ఏర్పాటుచేసినా,కొన్నిచోట్ల లేకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. సత్యనారాయణపురం జీవకోనలోని పాఠశాల పోలింగ్ కేంద్రంలో 200,202,203,204 బూత్‌లలో ఈవిఎంలు 20నిమిషాలుపైగా మొరాయించాయి. తిరుపతి నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లు వేయడానికి అధికార వైసిపి అనుచరులు,కార్యకర్తలు రావడంతో గందరగోళం నెలకొంది, నగరంలోని ఖాదీకాలనీలో జగన్మాతచర్చిపాఠశాల కేంద్రం వద్ద కర్నూలు, చెన్నై, రేణిగుంట ప్రాంతాలనుండి దొంగ ఓట్లు వేసేందుకు యువకులు రావడంతో కూటమి నేతలు గుర్తించి పట్టుకున్నారు. దొంగ ఓటర్లకు ఇద్దరు వాలంటీర్లు సహకరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదుమంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని సీకాం కళాశాల పోలింగ్ కేంద్రంలో వైసిపి నేత ,కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి దౌర్జన్యంతో దొంగ ఓట్లు వేయించేందుకు ప్రయత్నించారు. అక్కడకు చేరుకున్న కూటమి నేత అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కుమారుడు జగన్‌ను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. టిడిపి నేత సుగుణమ్మ అక్కడకు చేరుకుని మాట్లాడటంతో పరిస్థితి సద్దుమణిగింది. నగరంలోని 13వవార్డు గోవిందరాజస్వామి కళాశాల పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు వేయించేందుకు వైసిపి నేతలు ప్రయత్నించడంతో జనసేన,టిడిపి నేతలు కిరణ్‌రాయల్, నరసింహయాదవ్ అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. దొడ్డాపురంవీధిలో దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన వైసిపి అనుచరులు ఇద్దరు యువకులను బిఎస్‌ఎఫ్ బలగాలు పట్టుకున్నారు.

## బ్రాహ్మణ కాలువలో ఇరువర్గాల ఘర్షణ

**బిఎస్‌ఎఫ్ బలగాలు గాలిలోకి కాల్పులు**

రామచంద్రాపురం, మే 13 ప్రభాతవార్త:



రావిళ్ళవారి పల్లి పంచాయతీ, బ్రాహ్మణ కాలువలో సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఇరువర్గా మధ్యన ఘర్షణ చోటుచేసుకున్నది. రావిళ్ళవారిపల్లికి చెందిన ఓ వృద్ధుడి ఓటు విషయమై తలెత్తిన వివాదంతో వైసిపి, టిడిపి వర్గాల మధ్యన వివాదం చోటుచేసుకున్నది. ఈ నేపథ్యంలో బ్రాహ్మణ కాలువ యువత పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని వైసిపి కార్యకర్తలపై దాడికి దిగారు. ఈ ఘర్షణ వాతావరణాన్ని నియంత్రించేందుకు బిఎస్‌ఎఫ్ బలగాలు గాలిలోకి కాల్పులు జరిపారు. పోలీసులు రంగంప్రవేశం చేసి గ్రామంలో యధావిధిగా పోలింగ్ ప్రక్రియను జరిపించారు. విషయం తెలుసుకున్న వైసిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నాని ఇక్కడికి చేరుకుని కార్యకర్తలకు భరోసా కల్పించారు.

# పోలింగ్ ఉద్రిక్తం



**- పుంగనూరు బురగమందలో ముగ్గురు 'దేశం' ఏజెంట్ల కిడ్నాప్ కలకలం**

**- గుడిపాల మండలం మండికృష్ణాపురంలో పోలింగ్ రక్తసిక్తం**

**- చిత్తూరులో 'దేశం' ఏజెంట్‌పై వైకాపా ఏజెంట్ దాడి**

**- 'దేశం' ఏజెంట్‌పై దాడి చేసిన అతన్ని అరెస్టు చేయాలని అభ్యర్థి గురజాల ఆందోళన**

**- మాజీ ఎమ్మెల్యే సికె బాబు, వైకాపా అభ్యర్థి విజయానందరెడ్డిల మధ్య వాగ్వివాదం**





చిత్తూరు, మే 13 ప్రభాతవార్త: జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో తీవ్ర ఉద్రిక్తతల మధ్య ముగిసింది. నియోజకవర్గాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ జిల్లాలో రికార్డు స్థాయిలో 77 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదు అయ్యింది. జిల్లాలో ఉదయం 7 గంటలకు మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ ఆపై ఊపందుకొంది. పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియాల్సివుండగా సాయంత్రం 6 గంటలకు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రంకు వచ్చిన వారందరికి ఓటు హక్కు వినియోగించుకొన అవకాశం ఎలక్షన్ కమీషన్ కల్పించడంతో రాత్రి 7 గంటల వరకు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓట్లు వేయడానికి బారులు తీరి నిలబడివున్నారు. జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు 74.93 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పోలింగ్ ప్రారంభానికి ముందే పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం బురగమంద పోలింగ్ కేంద్రంకు సంబంధించిన ముగ్గురు తెలుగుదేశం ఏజెంట్లు కిడ్నాప్‌కు గురికావడంతో కలకలం రేపింది. తమ పోలింగ్ ఏజెంట్లను వైకాపా నాయకులు కిడ్నాప్ చేశారని రాజంపేట జిల్లా తెలుగుదేశం ఇన్‌ఛార్జీ జగన్మోహన్‌రాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఎలక్షన్ కమీషన్ సైతం ఈ విషయంను సీరియస్‌గా తీసుకోవడంతో జిల్లా ఎలక్షన్ యంత్రాంగం, పోలీసులు కిడ్నాప్‌కు గురైన ముగ్గురు తెలుగుదేశం ఏజెంట్ల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఎట్టకేలకు కిడ్నాప్‌కు గురైన తెలుగుదేశంకు చెందిన ముగ్గురు ఏజెంట్లు పీలేరులో వున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి పోలీసులు హుటాహుటిన చేరుకొని కిడ్నాప్‌కు గురైన ముగ్గురు తెలుగుదేశం ఏజెంట్లను బురగమంద పోలింగ్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆపై అక్కడ పోలింగ్ ప్రారంభం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకొన్నారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గుడిపాల మండలం మండికృష్ణాపురం పోలింగ్ బూత్ రక్తసిక్తం అయ్యింది. ఈ పోలింగ్ బూత్‌లో తెలుగుదేశం, వైకాపా ఏజెంట్ల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం ఏజెంట్‌గా వున్న మహిళ తండ్రి చంద్ర వైకాపా ఏజెంట్ సురేష్‌పై కత్తితో దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సురేష్ ప్రస్తుత వైకాపా ఎంపిపి ప్రసాద్‌రెడ్డి సోదరుడు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం మొదట బొమ్మసముద్రం పిహెచ్‌సి ఆపై మెరుగైన చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన సురేష్‌ను వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. చిత్తూరు డిఇఓ కార్యాలయ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో వైకాపా ఏజెంట్ తెలుగుదేశం ఏజెంట్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తమ ఏజెంట్‌పై దాడి చేసిన వైకాపా ఏజెంట్‌ను విధుల్లో కొనసాగిస్తుండటంతో ఆగ్రహించిన తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడు, మాజీ మేయర్ కఠారి హేమలతలు ఆందోళనలకు దిగడంతో పోలీసులు వైకాపా ఏజెంట్‌ను అరెస్టు చేయడంతో అక్కడ పరిస్థితి సద్దుమణిగి పోలింగ్ మళ్ళీ ప్రారంభమైంది. చిత్తూరు మిట్టూరులోని పోలింగ్ బూత్‌లో మాజీ ఎమ్మెల్యే సికె బాబు, వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి మధ్య తీవ్ర వాగ్వివాదం జరుగడంతో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. పోలింగ్ సరళిని పరిశీలించడానికి పోలింగ్ బూత్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే సికె బాబు అక్కడ వైకాపా ఏజెంట్లను బెదిరిస్తున్నారని అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డికి సమాచారం అందడంతో ఆయన అక్కడికి చేరుకొని మాజీ ఎమ్మెల్యే సికె బాబుతో వాగ్వివాదంకు దిగారు. అక్కడికి చేరుకొన్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఇరు వర్గాలకు సర్ది చెప్పడంతో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చింది. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలో ఓ సర్పంచ్ పోలింగ్ కేంద్రంలో తాను ఓటు వేసిన విధానంను సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్పంచ్‌ను అరెస్టు చేశారు. జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ థామస్ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడానికి తమిళనాడు రాష్ట్రం నుండి ఎక్కువ మంది బౌన్సర్లను తీసుకువచ్చారని ఆరోపిస్తూ వైకాపా నాయకులు రోడ్డుపై ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. కుప్పం నియోజకవర్గం ఆర్ఎస్ పేటలోని పోలింగ్ బూత్‌లో వివాదం ఏర్పడటంతో ఇక్కడ తెలుగుదేశం నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకొంది. వెదురుకుప్పం మండలం దేవళంపేట పోలింగ్ బూత్‌లో ఓటింగ్ తీరును పరిశీలించడానికి వెళ్ళిన వైకాపా అభ్యర్థి కృపాలక్ష్మిని తెలుగుదేశం నాయకులు అడ్డుకోడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలంలో మాదిరెడ్డిపల్లి, భూమిరెడ్డిపల్లి, కీనాటంపల్లి పంచాయతీల్లోని పోలింగ్ బూత్‌ల్లో ఇరు పార్టీ నాయకుల మధ్య వాగ్వివాదం జరుగడంతో పోలింగ్‌కు కొంత అంతరాయం ఏర్పడింది.



యర్రాతివారిపల్లెలోని పోలింగ్‌కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబీకులు



నగరిలో ఓటుహక్కును వినియోగించుకున్న మంత్రి రోజా





చిత్తూరు బాపుబాల భవన్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకొంటున్న కలెక్టర్ సగిలి షన్మోహన్, తిరుపతిలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్

## శభాష్ రత్నమ్మ...!

**-టెండరు ఓటేసిన వైనం**



చౌడేపల్లి, మే 13( ప్రభాతవార్త : తన ఓటును వేరొకరు వేసిన కారణంగా అధికారులతో వాగ్వాదానికి దిగి మరీ ఓ వృద్ధురాలు ఓటు హక్కును వినయోగించుకొన్న వైనం. చౌడేపల్లి మోటారు వీధికి చెందిన రత్నమ్మ(68) సార్వ త్రిక ఎన్నికల్లో ఓటేసేందుకు స్థానిక ప్రాథమిక పాఠశాలలోని 106పోలింగ్ కేంద్రానికి వెళ్ళింది. అయితే అప్పటికే తన ఓటును ఎవరో వేశారని అధికారులు తెలపడంతో ఆమెలో ఒక్కసారిగా ఆవేశం కట్టలు తెంచుకొన్నాయి. రాజ్యాంగం కల్పించిన తన ఓటు హక్కును వేసి తీరుతానని ఆమె భీష్మించుకు కూర్చోవడంతో చేసేది లేక పోలింగ్ కేంద్ర అధికారి రత్నమ్మచే టెంటరోటు వేయించారు. తమ ఓటును ఎవరైనా వేసేస్తే పెదవి విరుచకొని వెళ్ళే వారిని మనం చేస్తున్నాం, అయితే ఓ వృద్ధురాలు పట్టపట్టి మరీ ఓటు హక్కును వినియోగించుకోవడంతో అందరూ శభాష్ రత్నమ్మా అన్నారు.

### కుప్పంలో ఎన్నికల సరళిపై చంద్రబాబు ఆరా

కుప్పం, మే 13 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలపై తెదేపా అధినేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడు ఆరా తీశారు. ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు ఉదయం 10గంటల ప్రాంతంలో ఫోన్ చేసి ఎన్నికల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటికి పదిశాతం పోలింగ్ జరిగిందని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల సమాధానం ఇచా ్చరు. రాష్ట్రంలో వేవ్ తెలుగుదేశం పార్టీ వైపే ఉందని ఓటర్లు కూడా తెదేపాకే మొగ్గు చూపుతున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించి ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా చూడాలని చంద్రబాబు సూచించారు.

## ముద్దనపల్లి సర్పంచ్‌ను బైండోవర్ చేసిన పోలీసులు

**- వైకాపాకు ఓటు వేసిన వీడియో సోషియల్ మీడియాలో పోస్ట్ !!**

రామకుప ్పం, మే 13 ప్రభాతవార్త

మండలంలోని ముద్దనపల్లి పంచాయతీ సర్పంచ్ సికందర్‌పై రామకుప్పం పోలీసులు బైండోవర్ చేసి వదిలి పెట్టారు. సోమవారం ఈయన తన ఓటు హక్కు వినియోగించుకుని తాను వైకాపాకు ఓటేసినట్లు ఇవిఎం మిషన్ చూపుతూ తీసిన వీడియోను సోషియల్ మీడియాలో పోస్ట్ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అతన్ని రామకుప్పం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం అతన్ని హెచ్చరించి బైండోవర్ చేసిన అనంతరం ఇంటికి పంపారు.



ప్రభాతవార్త-తిరుపతి:

# గెలుపెవరిదో!?

**-ఈవిఎంలలో నేతల భవితవ్యం !**

**-22రోజులు ఉత్కంఠ నిరీక్షణ!!**

ఇది వరకు జరిగిన పలు దఫాల ఎన్నికల కంటే ప్రస్తుతం ముగిసిన ఓటింగ్‌పై అందరి భవితవ్యం ఆధారపడింది. నాయకుల ఓటుబ్యాంకు ఈవిఎంలలో నిక్షిప్తమయ్యాయి. ఓటర్లు ఎవరివైపు మొగ్గుచూపారు?ఎవరిని తమ నేతగా ఎన్నుకోనున్నారనేది!!మాత్రం జూన్ 4వతేదీ మరో 22రోజులు ఉత్కంఠ నిరీక్షణ తప్పదు. సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుపతి,చిత్తూరుజిల్లాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సరళికూడా ఎవ్వరూ ఊహించని రీతిలో సాగింది. తిరుపతి జిల్లాలో 61శాతం వరకు పోలింగ్ నమోదుకాగా చిత్తూరుజిల్లాలో 75.67శాతం పోల్ అయ్యింది. ఈ పోలింగ్ సరళి ఓటర్లు చైతన్యానికి నిదర్శనంగా విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన 43రోజులు తరువాత సోమవారం జరిగిన ఎన్నికల్లో పట్టణాల్లోనేగాక గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఓటర్లు పెద్దసంఖ్యలో ఉదయం నుండి బారులు తీరారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఈ సారి ఓటు వేయడం మరో ప్రత్యేకత. ఈ సారి చిత్తూరుజిల్లాలో అధికార వైసిపితోబాటు టిడిపి, కాంగ్రెస్ పార్టీలు పోటీలో ఉన్నాయి. తమతమ అభ్యర్థులను రంగంలోకి దించాయి. తిరుపతి జిల్లాలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార వైసిపితోబాటు జనసేన కూటమి అభ్యర్థి, సిపిఐ కూటమి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ స్థానాలకు టిడిపి, వైసిపి మధ్యప్రధాన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం ముగిసిన పోలింగ్‌లో ఓటరు ఎవరికి తమ మద్దతు తెలిపారనేది మాత్రం జూన్ 4వతేదీనే అధికారికంగా వెల్లడికానుంది. కాగా అన్ని పార్టీల అభ్యర్థులు ఓటర్లకు తమను గెలిపిస్తే మీకు మంచి చేస్తాం...ఎన్నో పథకాలు అమలుచేస్తాం....అన్నీ అలాగే కొనసాగిస్తూ ఇంకా మంచిచేస్తామంటూ ప్రచారాల్లో ఊరించారు. ఓటర్లు అందరి మాటలు, హామీలు విన్నారు. తమ ఓటు మాత్రం నచ్చిన వారికే వేసేశారు. ఇవన్నీ కూడా ఇప్పుడు భద్రంగా ఈవిఎంలలో దాగాయి. అయితే వీటి లెక్కింపు జరిగే జూన్ 4వతేదీ వరకు అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులకు టెన్షన్ తప్పదు. తమ పార్టీ అంటే తమ పార్టీనే గెలుస్తుందని పలువురు ధీమా వ్యక్తం చేస్తున్నా ఎవరి మనోగతం ఏమిటో మాత్రం ఈవిఎంలలో భద్రమైంది. 22రోజులతరువాత ఈ ఉద్కంఠకు తెరపడనుంది.

## ఐరాలలో పోలింగ్ ప్రశాంతం

**ఐరాల,మే 13 ప్రభాతవార్త:**

మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. మండలంలో మొత్తం 41,033 మంది ఓటర్లు వుండగా వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి 45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈమేరకు ఉదయం 7 గంటలకు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రారంభం కాగా చుక్కావారిపల్లె పోలింగ్ కేంద్రంలో ఈవిఎం మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. అలాగే కాణిపాకం పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్లు పోలింగ్ ముగిసే సమయానికి కూడా రావడంతో వారికందరికి స్లిప్‌లు అందించి రాత్రి ఏడు గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ముదిగోళం, కలికిరిపల్లె పోలింగ్ కేంద్రాల వద్ద వైకాపా, టీడీపీ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు మినహా ఎన్నికల పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. ముఖ్యంగా సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి.

## పులిచెర్లలో కొనసాగుతున్న పోలింగ్

**కల్లూరు,మే13 ప్రభాతవార్త**

పులిచెర్ల మండలంలో సార్వ త్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిదిలో మొత్తం 38 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో మొత్తం 31,256 ఓట్లు ఉండగా సాయంత్రం సమయం ముగిసే సమయానికి 25525 ఓట్లు పోలయ్యాయి. మరో రెండు పోలింగ్‌కేంద్రాలలో ఓటర్లు సమయానికి మించి ఉండటంతో పోలింగ్ పక్రియ కొనసాగుతోంది. తహశీల్దారు వసంతలత, ఎస్ఐ రవీప్రకాష్‌రెడ్డిలు అద్వర్యంలో ఎన్నికలు సజావుగా జరిగాయి

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**బంగారుపాళ్యం, మే 13 ప్రభాతవార్త:** బంగారుపాళ్యం మండల పరిధిలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలో 59,03,023 ఓట్లు వుండగా 68 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉదయమే క్యూ లైన్లలోబారులు తీరారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మహాసముద్రం పోలింగ్ కేంద్రంలో ఇవిఎం మొరాయించ దంతో గంట ఆలస్యంతో పోలింగ్ ప్రారంభమైంది. అలాగే నలగాంపల్లి, టేకుమంద, దిగువరాగి మానుపెంట పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలు సక్రమంగా పని చేయకపోవడంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించారు. అలాగే ఈచనేరిపల్లి పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 6 గంటలు ముగిసినా ఓటర్లు వేటు వేయడానికి వేచి వున్నా రు. పోలింగ్ సిబ్బంది ఓటు కోసం వచ్చిన వారికి ప్రత్యేక స్లిప్పులు జారీ చేసి అందరు ఓటు హక్కు విని యోగించుకొనేలా చేశారు. మండల పరిదిలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైకాపా తరపున ఎన్నికల పోలింగ్‌ను మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడి, తెలుగుదేశం తరపున పార్టీ మండల అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్, ఇతర నాయకులు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

## గుడిపాల పోలింగ్ కేంద్రంలో ఉద్రిక్తత

**గుడిపాల, మే 13 ప్రభాతవార్త:** మండల కేంద్రం గుడిపాల పోలింగ్ కేంద్రంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఉద్రిక్తత చోటు చేసుకొంది. తెలుగుదేశం నాయకులు వృద్ధులను ఓటు వేయడానికి తీసుకెళ్తున్నట్లు తీసుకెళ్ళి ఆ పార్టీకి అనుకూలంగా ఓట్లు వేసుకొంటున్నారని వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డికి వైకాపా నాయకులు చెప్పడంతో ఆయన పోలింగ్ కేంద్రంకు చేరుకొన్నారు. ఇదే సమయంలో అక్కడికి తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడు రావడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. పోలింగ్ కేంద్రానికి జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ చందోలు, డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డిలు చేరుకొని ఇరు వర్గాలకు సర్ది చెప్పి పరిస్థితులను చక్క దిద్దారు. అలాగే పిళ్ళారికుప్పం, పాపిశెట్టిపల్లి, చీలాపల్లి పోలింగ్ కేంద్రాల్లో చెదురు ముదురు సంఘటనలు చోటు చేసుకోగా మండలంలో మిగిలిన ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలస్థాయిలోపోలింగ్‌నుతహసిల్దారువిజయలక్ష్మి, ఎంపిడిఓ రాజశేఖర్‌రెడ్డిలుపర్యవేక్షించారు.

## భారీగా అక్రమ మద్యం పట్టివేత

**పాలసముద్రం, మే 13 ప్రభాతవార్త:**

తమిళనాడు నుండి అక్రమ మద్యంను ట్రిప్పర్‌లో భారీగా పాలసముద్రం మండలంకు తరలిస్తున్నారని పోలీసులకు సోమవారం సమాచారం రావడంతో ఎస్ఐ భారతి ఆధ్వర్యంలో పాలసముద్రం పోలీసులు ట్రిప్పన్‌ను వెంబడించి కృష్ణజిమ్మాజిపురం గ్రామం వద్ద పట్టుకొన్నారు. ఈ విషయంగా ఎస్ఐ భారతి మాట్లాడుతూ తమిళనాడు నుండి భారీగా అక్రమ మద్యం మండలంకు రవాణా అవుతుందని సమాచారం రావడంతో అందిన సమాచారం మేరకు ట్రిప్పర్‌ను వెంబడించి పట్టుకొన్నామన్నారు. ట్రిప్పన్‌ను పరిశీలించి చూస్తే అందులో భారీగా మద్యం నిల్వలు వున్నాయన్నారు. అయితే ఈ మద్యం నిల్వలు ఎవరివి అనే విషయం తెలియడం లేదని దీనిపై విచారణ చేస్తున్నామని ఆవమె పేర్కొన్నారు.

## సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతం

### -మొరాయించిన ఇవిఎంలు -ఆరుదాటినా కొనసాగిన పోలింగ్

**చౌడేపల్లి, మే 13 ప్రభాతవార్త**



నియోజకవర్గ వ్యాప్తంగా చదురు మొదురు సంఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పలుచోట్ల ఇవిఎంలు మొరాయించడంతో ఆలస్యంగా ప్రారంభమయ్యి సాయంత్రం నిర్ణీత వ్యవధి 6గంటలు దాటినా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఎండ తీవ్రత అధికంగా వుండటంతో ఉదయాన్నే 6గంటలకెళ్ళా ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటుహక్కును వినియోగించుకొనేందుకు బారులు తీరారు. పలుచోట్ల పోలింగ్ కేంద్రాలు ఇరుకుగా వుండటం, ఇరువురు వచ్చే దారి ఒకటే వుండటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చౌడేపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన 104 పోలింగ్ బూతుతో పాటు మండలంలోని పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొనింది. పెద్దకొండామర్రి, దుర్గసముద్రం, దాదేపల్లి తదితర ప్రాంతాల్లో ఇవిఎంలు మొరాయించాయి. అధికారులు అప్రమత్తమై వాటిని మరమ్మత్తు చేసారు. తీవ్ర ఎండ, ఉక్కపోతకు కొందరు ఓటర్లు పలు పోలింగ్ కేంద్రం నుంచి వెనుతిరిగారు. సాయంత్రం వచ్చి ఓటుహక్కును వినయోగించుకొన్నారు. బిఎస్‌పి నియోజకవర్గ అభ్యర్థి వసంతపల్లి సురేష్ శెట్టిపేట పోలింగ్ బూతులో తన ఓటుహక్కును వినియోగించుకొన్నాడు. మండలంలో 40 పోలింగ్ బూతులుండగా ప్రతి పోలింగ్ బూతులోనూ 75శాతం నుంచి 95శాతం వరకు పోలింగ్ జరిగింది. దుర్గసముద్రం పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులకు కొందరు వ్యక్తులకు వాగ్వాదం చోటు చేసుకొంది. తోపులాటలతో ఉద్రిక్త వాతావరణ పరిస్థితి నెలకొనింది. అదే విధంగా చౌడేపల్లి 101, 102 పోలింగ్ కేంద్రం ఉన్నతపాఠశాల ముందు కొందరు వ్యక్తిగత కారణాల వల్ల ఘర్షణకు దిగారు. స్థానికులు పరిస్థితిని సద్దుమనిగించారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు. సమస్యాత్మక కేంద్రాలైన కాటిపేరి, చారాల, దుర్గసముద్రం, దాదేపల్లి, గడ్డంవారిపల్లి వంటి పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు మొహరించాయి.

## ఎన్నికల ఉత్కంఠను పట్టించుకోని వైకాపా అభ్యర్థి వెంకటేగౌడా

### -యువతతో క్రికెట్ ఆడిన వెంకటేగౌడా

**పలమనేరు టౌన్,మే 13,ప్రభాతవార్త:**

పలమనేరు వైకాపా అభ్యర్థి ఎన్నికల ఉత్కంఠను పక్కన పెట్టి ఉదయం వి.కోట మండలంలోని ఆయన స్వగ్రామం తోటకనుమలో ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం వి.కోట మండలంలోని బోడిగుట్లపల్లె గ్రామం సమీపంలోని పొలాల వద్ద యువత క్రికెట్ అడుతుంటే వారితో కలసి క్రికెట్ అడుకోవడం జరిగింది. నియోజకవర్గంలో వైకాపా, టిడిపి ఇరుపార్టీ మధ్య గట్టిపోటీ ఉంది. అయినప్పటికి వైకాపా అభ్యర్థి తన గెలుపు కాయమన్నట్లు ఆయన సరదాగా క్రికెట్ ఆడుకోవడంతో పాటు వైకాపా నేతలకుగెలుపుమనదేఅంటు ధీమ వ్యక్తం చేయడం తెలిసిన ప్రతిపక్ష నాయకులు ఆచ్చర్యం వ్యక్తం చేశారు.

## గంటావూరు పోలింగ్ కేంద్ర వద్ద ఓటరులకు పోలీసులకు మధ్య వాగ్వాదం

### -6 గంటలపై అనుమతించమంటూ ఓటరులను పంపివేసిన పోలీసులు

**పలమనేరు టౌన్,మే 13,ప్రభాతవార్త:**

పలమనేరు పట్టణంలోని గంటావూరు పోలింగ్ కేంద్రం వద్ద ఓటరులకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గంటావూరు 267,268 పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 గంటలు కావడంతో ఓటరులను పోలీసులు అనుపతించలేదు. దీంతో ఓటర్లు ఇదివరకే పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నామని తమకు ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరినప్పటికి వారు అనుమతించక పోవడంతో ఓటర్లకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో సుమారు 20 మందికి పైగా ఓటర్లు ఓటు వేయకుండా వెనుదిరిగారు. 267 పోలింగ్ కేంద్రంలో ఇద్దరు ఓటర్లు వరుసలో ఉన్నప్పటికి వారిని అధికారులు అనుమతించకపోవడంతోకొంతసమయంఎన్నికల సిబ్బందికి ఓటరుకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

## తవణంపల్లెలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

### -మొరాయించిన ఈవిఎంలు: ఏడు గంటల వరకు పోలింగ్



**తవణంపల్లె, మే 13 ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్ మండలంలో ప్రశాతంగా ముగిసింది. కట్టుదిట్టమైన బందోబస్తు నడుమ మండలంలో ఎన్నికల పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈపోలింగ్ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 21,012 మంది పురుషులు, 21,943 మంది మహిళలు, ఒకట్రాన్స్ జెండర్ తమ ఓటు హక్కును వినియోగించడానికి వీలుగా 56 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈపోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా పుణ్యసముద్రం (బూత్ నెం.127), అరగొండ (బూత్ నెం.108, 106), పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రారంభం కాకముందే ఈవియంలు మొరాయించడంతో సుమారు ఒకటిన్నర గంటల పాటు పోలింగ్ నిలిచి పోయింది. అలాగే మండలంలోని ఎగువ తడకర గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ బూత్ వద్ద ఓటర్లు అధికంగా వుండడంతో వారికి స్లిప్‌లు జారీ చేసి రాత్రి ఏడు గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పలమనేరులో టిడిపి-వైకాపా మధ్య ఘర్షణ

### -పోలింగ్ కేంద్రం వద్ద ఇరు పార్టీల వాగ్వాదం- పోలీసుల చొరవతో సద్దుమణిగిన ఘర్షణ

**పలమనేరు,మే 13,ప్రభాతవార్త:**

పలమనేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద పోలింగ్ కేంద్రం వద్ద టిడిపి వైకాపాల మధ్యఘర్షణ వాతావరణం నెలకొంది. పోలింగ్ కేంద్రంలో అధికారులు వృద్ధుల వద్ద బలవంతంగా టిడిపికి ఓటు వేపించారని వైకాపా నాయకులు సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరడం జరిగింది. ఈ క్రమంలోటిడిపినాయకులు ఘటనాస్థలం వద్దకు చేరుకుని వైకాపా నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శలు చేయడంతో అక్కడ కొద్ది పాటి ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న సిఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరుపార్టీల నేతలను అక్కడి నుండి పంపివేయడంతో సమస్య సద్దుమణిగింది. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఇరు పార్టీ నాయకుల మధ్య స్వల్ప పాటి వాగ్వాదం చోటుచేసుకుంది.

## పశాంతంగా ముగిసిన ఎన్నికలు

**కార్వేటినగరం,మే 13 ప్రభాతవార్త:**

కార్వేటినగరంమండలంలోసోమవారంజరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 22పంచాయితీలకుగాను50పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోఅన్నూరులోవైసిపి, టిడిపి నేతలమధ్య కొంతసేపు వాగ్వా వాదంచోటు చేసుకుంది. ఇరుపార్టీలు ఒకరినొకరు దుర్భాషలాడుకున్నారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని ఘర్షణలు జరగకుండా నివారించారు. మండలంలో 5 గంటల వరకు 71.70శాతం, ఆరుగంటల వరకు 83శాతం వరకు పోలైనట్లు తహాశీల్దారు శాంతకుమారి తెలిపారు. ఓటర్లు ఎండను సైతం లెక్క చేయక బారులు తీరి ఓటును సద్వినియోగం చేసుకున్నారు. కార్వేటినగరం సిఐసత్యబాబు, ఎస్ఐవెంకటేశ్వర్లుఅవాంఛనీయఘటనలుచోటుచేసుకోకుండాగట్టిబందోబస్తునునిర్వహించరు.

## ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్

### - మాంబేడు, పచ్చికాపల్లం, జక్కదొనలలో తోపులాటలు

**వెదురుకుప్పం, మే 13 ప్రభాతవార్త :**



మండలంలో సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని మాంబేడు, పచ్చికాపల్లం, జక్కదొన, తిప్పినాయుడుపల్లె, దేవళంపేట పోలింగ్ కేంద్రాలలో తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దడంతో సజావుగా ఎన్నికల నిర్వహణ జరిగింది. కాగా దేవళంపేటలో వైసీపీ అభ్యర్థి కళాత్తూరు కృపాలక్ష్మీ పోలింగ్ సరళిని పరిశీలించడంకు దేవళంపేట ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంకు చేరుకున్న సమయంలో ఓ టిడిపి నాయకుడికి వైసీపీ అభ్యర్థికి నడుమ మాటమాట పెరిగి వాగ్వివాదం చోటుచేసుకోవడంతో స్థానిక నాయకులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. మండలంలో 40 పోలింగ్ కేంద్రాలు ఉండగా స్త్రీలు 18192, పురుషులు 18018, ఇతరులు 3 కలిపి 36213 మంది ఓటర్లు ఉన్నారు. మండుటేండలను సైతం లెక్క చేయకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంకు క్యూ లైన్‌లో బారులు తీరి ఓటు వేయడం జరిగింది. మాంబేడు గ్రామంలో ఎండలకు భయపడి సాయంత్రం ఒక్కసారిగా పోలింగ్ కేంద్రంకు ఓటర్లు చేరుకోవడంతో తోపులాటలు జరిగింది. సమాచారం తెలిసి తహాశీల్దార్ జయంత్ కుమార్, అదనపు పోలీసు బలగాలు మాంబేడుకు చేరుకుని పరిస్థితిని సర్దుబాటు చేయడంతో తిరిగి ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైయింది. నియోజకవర్గంలో 85 శాతం పోలింగ్ జరిగిందని

## ఓటు హక్కును వినియోగించుకొన్న 97యేళ్ళ వృద్ధురాలు

**చౌడేపల్లి, మే 13 ప్రభాతవార్త**



మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ చుక్కావారిపల్లికి చెందిన నరసమ్మ(97) వృద్ధురాలు తన ఓటు హక్కును వినియోగించుకొంది. సాధారణంగా 80యేళ్ళు దాటిన వృద్ధులు బయటకు వచ్చేందుకు సాహించరు. అలాంటిది ఏకంగా 97యేళ్ళు దాటిన నరసమ్మ ఓటు వేయాలని పట్టుపట్టి కుటుంబ సభ్యుల సహకారంతో పందిళ్ళపల్లి పాఠశాలలో గల పోలింగ్ బూతకు వచ్చి ఓటేసింది.

## రొంపిచెర్లలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్

**రొంపిచెర్ల మే 13ప్రభాతవార్త**

మండల పరిధిలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 80 శాతం మంది ఓటు హక్కును వినియోగించారు. ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఈక్రమంలో ఫజులపేట పోలింగ్ బూత్‌లో 88 శాతం పోలింగ్ నమోదైంది. రొంపిచెర్ల, బొమ్మయ్యగారి పల్లెలో పోలింగు సరళిని రాజంపేట వైకాపా ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిదున్‌రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు పరిశీలించారు. అంతవరకు ఓటర్లు నిలబడి ఎదురు చూడాల్సి వచ్చింది. మండలంలో ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల పక్రియ పూర్తయింది.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మాదే మళ్ళీ విజయం : నేదురుమల్లి

**వెంకటగిరి టౌన్, మే 13, ప్రభాతవార్త**

రాష్ట్రంలో తమ పార్టీనే మళ్ళీ విజయం సాధిస్తుందని, వైకాపా జిల్లా అధ్య క్షులు, అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మరల సిఎం అవుతారని తెలిపారు. తమకు 175 స్థానాలను ప్రజలు ఇస్తున్నారని తెలిపారు.

## చంద్రబాబు సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారు

### టిడిపి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ



**వెంకటగిరి టౌన్, మే 13, ప్రభాతవార్త**

తెలుగుదేశం తప్పకుండా అధికారంలోకి వస్తుందని చంద్రబాబు నాయుడు సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని టిడిపి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కురుగొండ్ల సతీ మణి సింధు చౌదరి, కుమార్తె లక్ష్మి సాయి ప్రియతో కలిసి ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసందర్భంగాఆయనమాట్లాడుతూవైసిపిని ఓడించాలని కసితో ప్రజలు ఓట్లు వేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడు సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

### ఖండించిన ప్రజా సంఘాల నేతలు

**వెంకటగిరి టౌన్, మే 13, ప్రభాతవార్త**



స్థానిక క్రాస్ రోడ్ ప్రాంతాల్లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. అంబేద్కర్ తలను తొలగించిదూరంగా పడవేశారు. అంబేద్కర్‌తలను తొలగించిదూరంగా పడేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని సిసి కెమెరాలు ద్వారా గుర్తిస్తామని పోలీ సులు తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసు కోవాలని నవజీవన్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు సహదేవయ్య, ఏపిటీఎఫ్ ఉపా ధ్యాయ సంఘం నాయకులు గౌస్‌బాషా కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల పోలింగ్

**బాలాయపల్లి, మే 13, ప్రభాతవార్త**



మండలంలో పోలింగ్‌ప్రశాంతంగాముగిసింది. వెంగమాంబపురం, జయంపు, బాలాయపల్లితదితర పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించే దుకు బారులు చేరారు. పలుచోట్ల ఇ.వి.ఎంలు మొరాయించాయి. యాచవరం అరుంధతివాడలోని పోలింగ్ కేంద్రంలో కాసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదంజరిగింది. వృద్ధులు, దివ్యాంగులను ప్రత్యేకంగా తీసుకువచ్చి ఓటు వేయించారు. మండలంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.

## కోటలో ప్రశాంతంగా పోలింగ్

**కోట, మే 13 ప్రభాతవార్త**



కోట మండలంలో సోమవారం పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. అయితే ఇవిఎంలు పలుగ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ జరిగింది. చెందోడులో 176 పోలింగ్ బూత్‌లో 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ అర్ధగంట ఆలస్యంగా ప్రారంభమైంది. కొక్కుపాడు, కేశవరం గ్రామాల్లో కూడా ఇవిఎంలు మొరాయించాయి. కేశవరంలో అయితే 3 గంటల పాటు ఆలస్యంగా ప్రారంభించారు. కోటలో కూడా పలు బూత్‌లలో ఇవిఎంలు మొరాయించడంతో అక్కడ ప్రజలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

**కోట, మే 13 ప్రభాతవార్త**

కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బూత్‌లో వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీసభ్యులు, వెంకటగిరి నియోజకవర్గం పరిశీలకులు కొడవ లూరు ధనంజయరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వెంకన్నపాలెంలో కేంద్రమాజీమంత్రిపనబాకలక్ష్మిదంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కోటలో నల్లపరెడ్డి సోదరులు నల్లపరెడ్డి రాజేంద్రరెడ్డి, నల్లపరెడ్డి రవీంద్రారెడ్డి, నల్లపరెడ్డిజగన్‌మోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మద్దాలి, చిట్టేడు, ఊనుగుంటపాలెం గ్రామాల్లో పోలింగ్‌సరళిని ధనంజయరెడ్డి పర్యవేక్షించారు. వంజివాక, పుచ్చల పల్లి గ్రామాల్లో దువ్వూరు వెంకటరమణారెడ్డి, పాదర్తి రాధాకృష్ణారెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు.

## ప్రజా సంక్షేమం వైపే మహిళలు

**కోట, మే 13 ప్రభాతవార్త**

మహిళలు ప్రజా సంక్షేమం వైపే నిలబడ్డారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం కోట మండలం అల్లంపాడు గ్రామంలో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ సరళిని చూస్తుంటే వైఎస్సార్ కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట దువ్వూరు వెంకటరమణారెడ్డి, పాదర్తి రాధాకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## తరలివచ్చిన ఓటర్లు

**కోట, మే 13 ప్రభాతవార్త**

కోట మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్లు వేసేందుకు ఓటర్లు తరలివచ్చారు. ఉదయం7 గంటల నుంచి పెద్దసంఖ్య లో పోలింగ్ బూత్‌లకు తరలివచ్చి ఓట్లు వేసిన వారికి తెలుగుదేశం సీనియర్ నేత ఉచ్చూరురవీంద్రనాథ్‌రెడ్డి, పలగాటిభాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరథ రామి రెడ్డి, జలీల్ అహ్మద్ బాషా ధన్యవాదాలు తెలిపారు.

## చిట్టమూరులో ప్రశాంతంగా పోలింగ్

**చిట్టమూరు, మే 13 ప్రభాతవార్త**



చిట్టమూరు మండలంలోని 23 పంచాయతీల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గతఎన్నికల కన్నా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇరుపార్టీలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 7 గంటల నుంచే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు సైతం భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇదిలావుంటే గూడూరు వైసీపీఅభ్యర్థి మేరిగ మురళీధర్ యాకసిరి పంచాయతీ లోని గన్నంగిదిబ్బ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు గెంజి సుబ్రహ్మణ్యం ప్రసాద్, కాకు ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ యువనేత సుధీర్‌రెడ్డిలతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## సూళ్లూరుపేటలో ప్రశాంతంగా పోలింగ్

### - బారులు తీరిన ఓటర్లు

**సూళ్లూరుపేట, మే 13 ప్రభాతవార్త**



సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సూళ్లూరుపేటలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. అధిక సంఖ్యలో మహిళలు, ఉద్యోగులు, యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకు గంటలతరబడి క్యూలైన్లలో బారులు తీరినిలబడ్డారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. పోటాపోటీగా తమ అభ్యర్థికి ఓటు వేయా లంటూ ప్రధాన పార్టీల వారు ఓటర్లను వేడుకున్నారు. అలాగే సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తడ మండలంలోని స్వగ్రామం కాదలూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సి పాలిటీలలో భారీ ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సన్నద్ధమవడంతో గంటలకొద్దీ క్యూలో నిలబడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన పార్టీలఅభ్యర్థుల నెలవల విజయశ్రీ, కిలివేటి సంజీవయ్యలు నియోజక వర్గంలోని పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది బాధ్యతగా పనిచేయడంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో చిన్నచిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

## చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్

**తడ, మే 13 ప్రభాతవార్త**



తడ మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో సోమవారం సార్వత్రిక ఎన్ని కల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గ్రద్దగుంట తదితర చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. చినమాంబట్టు, పెదమాంబట్టు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడంతో అక్కడ పోలింగ్ మందకొడిగా సాగింది. రాత్రి దాకా క్యూలైన్లు ఉండటంతో అధికారులు పోలింగ్‌ను కొనసాగించారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా చినమాంబట్టులో 300 మందికి పైగాఓటర్లు క్యూకట్టడం విశేషం. ఇదిలావుంటే సమస్యాత్మక గ్రామమైన ఇరకం దీవిలో ఎన్నికలను అధికారులు ఇబ్బందులు లేకుండా నిర్వహించారు. అక్కడ జాలర్లకుప్పానికి చెందిన 292 నంబరు పోలింగ్ బూత్‌లో 724 ఓట్లకు గాను 630 ఓట్లు పోలయ్యాయి. 291 పోలింగ్ కేంద్రంలో 420 ఓట్లకు గాను 371 ఓట్లు పోలైనట్లు తెలిసింది. మిగిలిన చోట్ల కూడా ఎన్నికలు ప్రశాంతంగా జరిపారు.

## డి.వి.సత్రంలో ప్రశాంతంగా పోలింగ్

**దొరవారిసత్రం మే 13 ప్రభాతవార్త ;**

మండలంలో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఓటర్లు ఉదయం నుండి పోలింగ్ భూతుల వద్ద క్యూలైన్లులో నిలబడి ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొత్తపల్లి, నేలపట్టు, పోలిరెడ్డిపాళెం, వెదురుపట్టు, మీజూరు పోలింగ్ బూత్‌లలో ఈవిఎంలు మొరాయించడంతో అధికారులు ఓటర్లు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు 3 గంటల ఆలస్యంగా ఈవిఎంలు పనిచేయడంతో ఓటర్లు రాత్రిసమయంలో కూడ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అధికారులుపోలింగ్‌బూత్‌ల వద్ద అవాంచనీయ ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు.

## కసిగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నిరీక్షణ

### - రాత్రి 12 గంటల దాకా పోలింగ్ జరిగే అవకాశం

**చిట్టమూరు, మే 13 ప్రభాతవార్త**



చిట్టమూరు మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల సమరంలో ఓటర్లలో కసితో పాటు సహనం కొట్టొచ్చినట్లు కనిపించింది. కొన్ని పంచాయతీలలో ఓటర్ల శాతం ఎక్కువగా ఉన్నా పోలింగ్ కేంద్రం ఒక్కటే ఉండటంతో పాటు ఈవీఎంల మొరాయింపు వెరసి పోలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు. యల్లసిరి, మల్లాం, యాకసిరి, చిట్టమూరు, ఆరూరు తదితర మేజర్ పంచాయతీలలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు చంటిబిడ్డలతో సహా పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసేందుకు ఎంతో ఓర్పుతో వేచి చూస్తుండటం దేనికి సంకేతమో తెలియాల్సి ఉంది.

## కూటమిదే విజయం : కురుగొండ్ల

**బాలాయపల్లి, మే 13, ప్రభాతవార్త**

తెలుగుదేశం ఘనవిజయంసాధిస్తుందని టిడిపిఅభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంగమాంబపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఓటింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు లందరూ తెలుగుదేశం వైపు ఉన్నట్లు అర్థమైందన్నారు. టిడిపి ఘన విజయం సాధిస్తుందని చెప్పారు.

## పోలింగ్ ప్రశాంతం

పాలసముద్రం, మే 13 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం మండల పరిధిలో 23 బూత్‌లు ఏర్పాటు చేయగా ఉదయం 7 గంటల నుండి ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకొన్నట్లు రిటర్నింగ్ అధికారి సుబ్బులక్ష్మీ తెలిపారు.

## 432 మద్యం బాటిళ్లు సీజ్

**కార్వేటినగరం,మే 13 ప్రభాతవార్త:**



కార్వేటినగరం ఎక్సైజ్ పరిధిలో వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం సమీపం లో 54432 రూపాయల విలువ చేసే 432 మద్యం బాటిళ్ళను పట్టుకున్నట్లు తెలిపారు. ఎపి03టిహెచ్1643 నెంబరుగల వాహనాన్నితనిఖీ చేయగా మద్యం పట్టుబడిందన్నారు. కర్ణాటకనుండిమద్యంతరలించి స్వంతగ్రామంలో అధికరేట్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ భాస్కర్ తెలిపారు

## తిరుచ్చి వాహనంపై "శ్రీ సీతారామలక్ష్మణులు"

**చంద్రగిరి, మే 13 ప్రభాతవార్త:**



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామలక్ష్మణ హనుమంతులు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణ హనుమంత స్వాముల ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు శ్రీ సీతా లక్ష్మణ సమేత హనుమంతులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్ నర్రా మునిచెంగల్రాయులు, అర్చకులు డి.వి.మురళి కృష్ణమాచార్యులు, రవిచంద్రన్, ఆలయ సిబ్బంది ఇల్లందు లక్ష్మీ రాజేష్, నల్లురి విష్ణుమూర్తి, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో ప్రశాంతంగా పోలింగ్

### పెరిగిన పోలింగ్ శాతం
### పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
### ఓటును వినియోగించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు

**గూడూరు, మే 13, ప్రభాతవార్త**

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గూడూరులో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటల నుండి ఓటు వేసేందుకు ప్రజలు క్యూలైన్‌లో నిలబడ్డారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. పోలింగ్ కేంద్రం నుండి వంద మీటర్ల దూరంలో వాహనాలను నిలిపి వేశారు. తిరుపతి పార్లమెంట్ బీజేపి అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ రావు, ఆయన సతీమణి, తనయుడు నవీన్ గుప్తాలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా ఎన్‌డిఏ కూటమి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గూడూరు రిటర్నింగ్ అధికారి కిరణ్ కుమార్ ఓటు వేశారు. సుమారు గూడూరు నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటలకు గాను 245205 మంది గాను 179280 ఓటర్లు వినియోగించుకున్నారు. సుమారు 73.11 శాతం నమోదు అయింది. ఎక్కడా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

## 80 శాతం ఓటింగ్ పోలింగ్

**వాకాడు, మే 13, ప్రభాతవార్త**

వాకాడు మండల పరిధిలోని సోమవారం 19 పంచాయితీ గ్రామాలలో 36 పోలింగ్ కేంద్రాలలో జరిగిన ఓటింగ్ శాతం 80 శాతం ఓట్లు పైనే ఓటింగ్ పోలింగ్ జరిగినట్లు మండల తహశీల్దార్ నరసింహారావు తెలిపారు. మండలంలోని కట్టుదిట్టమైన ఏర్పాటు చేసిన చోట ఓటింగ్ కోసం ప్రతి ఒక్కరూ క్యూలో నిలబడి తమ ఓటును వినియోగించుకున్నారు. ముఖ్యంగా బయట ప్రాంతాల నుంచి కూడా వచ్చి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వం పక్కాగా వచ్చిన ఓటర్లకు మౌలిక వసతులు కల్పించారు.

***– ఓటింగ్ బయట ఉద్రిక్తత ..***

మండల పరిధిలోని పలుచోట్ల ఉద్రిక్తత పరిస్థితి జరిగింది. మండలంలోని కొన్ని చోట్ల అనేక విధాలుగా రచ్చలో జరిగాయి. అవి కొన్ని చోట్ల ప్రమాదపూర్వకంగా జరగాల్సిన సమయంలో ఆగిపోయాయి. కొన్ని చోట్ల ఎవరికి వారు పరిస్థితులను అర్ధం చేసుకొని సర్దుబాటు చేసుకున్నారు. కావాల్సిన వారు, సర్దుకుని ఓటింగ్ శాతం పెంచుకున్నారు. ఇరువురి నాయకులు వారికి వారే గొప్పలు చాటుకున్నారు.

## శ్రీకాళహస్తిలో క్రాస్ ఓటింగ్ : ఎరికి లాభం ఎవరికి నష్టం?!

### మేము గెలిచామంటే మేమే గెలిచేసాం: ఎవరి అంచనాలు వారివి:

**శ్రీకాళహస్తి, మే 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సోమ వారం జరిగిన సార్వత్రిక ఎన్ని కల్లో సాయంత్రం 5గంటలకు అధికారులు అందించిన సమాచారం మేరకు 72శాతం పోలింగ్ జరిగినట్లు ప్రకటించారు. ఉదయం నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలు బారులు తీరారు. ముఖ్యంగా ముస్లిం మహిళలు ఓటింగ్ రావటం అరుదు.ఉదయం 6గంటల నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద ఓట్లు వేయటానికి నిరీక్షించారు.ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలు విచ్చల విడిగా కరెన్సీ వర్షం కురిపించారు. ఓ పార్టీ ఓటుకు రూ.3వేలు అందిస్తూ ముక్కుపుడకలు,చీరలు, కాలివెండిమెట్టెలు అందించారు. మరో పార్టీ కొన్ని చోట్ల చీరలతో పాటు రూ.2వేలు అందించారు. అయితే ఓటర్లు ఇద్దరి వద్ద సొమ్ములు తీసుకున్నారు. మరి ఓటు ఎవరికి వేసారో? అనేది ప్రశ్నర్థకంగా మారింది.

**క్రాస్ ఓటింగ్‌తో గందరగోళం:**

శ్రీకాళహస్తి సాధారణ ఎన్నికల్లో సోమవారం జరిగిన పార్లమెంట్,శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు అత్యధిక సంఖ్యలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు స్పష్టమైంది. దాంతో క్రాస్ ఓటింగ్ ఎవరికి మేలు చేస్తుంది.ఎవరిని నష్టపరుస్తుందనేది నియోజకవర్గంలో చర్చనీయంశంగా మారింది.జనం చర్చించుకుంటున్న మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొదటి ఓటును ఓ పార్టీకి వేసిన ఓటరన్న రెండవ ఓటును క్రాస్ చేసినట్లు చెబుతున్నారు. మరి ఈ నిర్ణయం ఎవరికి లాభమో? ఎవరికి నష్టమో స్పష్టం కావటం లేదు.అయితే తాము డబ్బులు అధికంగా పంచేసాం మాకే అనుకూలమని ఓ పార్టీ క్రాస్ ఓటింగ్ మాకే అనుకూలమని ప్రతి పక్షం అంచానాలు వేసుకుంటున్నారు. మరి బ్యాలెట్ బాక్సులు విప్పితే తప్ప ఓటరన్న తీర్పు ఎలా ఉందో తేట తెల్లమవదు.

## ప్రశాంతంగా ప్రారంభమై ఉద్రిక్తల మధ్య ముగింపు

### మహిళా ఓటర్లు అత్యధికం

**శ్రీకాళహస్తి, మే 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సోమవారం ఉదయం ప్రశాంత వాతారణంలో ప్రారంభమైన ఎంపి,ఎంఎల్‌ఏ ఎన్నికల పోలింగ్ సాయంత్రం ఉద్రిక్తల మధ్య ముగిసింది. రెవెన్యూ అధికారులు అందించిన సమాచారం మేరకు సాయంత్రం 5గంటల వరకు నియోజకవర్గంలోని 293 పోలింగ్‌బూత్‌లలో మొత్తం 2,48,536 మంది ఓటర్లుండగా ఇందులో పురుషులు 80,214 మంది,మహిళలు 99,576 మంది వెరసి 1,79,790 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు సమాచారం అందించారు.ఐదుగంటల వరకు 72.34 శాతం పోలైనట్లు తెలిపారు. చివరి గంటలో ఎంత పోలైంది ప్రకటించలేదు.

**మొరాయించిన ఈ వి ఎం లు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట,ఏర్పేడు,శ్రీకాళహస్తి రూరల్,అర్బన్‌లోనూ, తొట్టంబేడు మండలంలో సోమవారం సూర్యోదయానికి ముందే ఓటర్లు, ముఖ్యంగా మహిళా పోలింగ్ బూత్‌ల వద్ద చేరారు. నియోజకవర్గంలోని ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొనుటకు శ్రీకాళహస్తిరూరల్‌లో 62,అర్బన్‌లో 68,రేణిగుంటలో 66,ఏర్పేడులో 52,తొట్టంబేడులో 45 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసారు. ఉదయం పట్టణంలోనూ, గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద ఈవిఎంలు మొరాయించి ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.శ్రీకాళహస్తి పట్టణంలోని హరహర బావి, బాలికోన్నత పాఠశాల,సాలిపేట వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పలు చోట్ల రిగ్గింగ్‌కు పాల్పడాతారనే భావంతో ఇద్దరు నాయకులు చేరుకోవటంతో పోలీసులకు ముచ్చెమటలు పట్టాయి. అయితే ముందు జాగ్రత్తగా అధికారులు సరిగ్గా ఆరుగంటలకు డోర్‌లు మూసివేసారు.

**గ్రామాల్లో రాత్రి 10గంటల వరకు సాగుతున్న పోలింగ్:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్‌కు హాజరైన మహిళలు,పురుష ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి కనబడ్డారు. ఇక్కడ ఉదయం నుంచి పోలింగ్ జరిగినా రాత్రి 10గంటల వరకు కూడా కొనసాగుతూనే ఉన్నట్లు సమాచారం అందింది.

**మహిళా ఓటర్లు ఎవరికి ఓటు వేసారు?**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పురుష ఓటర్లుకన్నా మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్నారు.మహిళా ఓటర్లు 1,25,700 కాగా పురుష ఓటర్లు 1,17,723 మంది ఉన్నారు. సాయంత్రం వరకు రెవెన్యూ శాఖ అందించిన సమాచారం మేరకు మహిళలు99,576 మంది ఓటు వేయగా పురుషులు 80,214 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అంటే పురుషుల కన్నా మహిళలు 19వేల మంది అధికంగా ఓట్లు వేసారు. దాంతో రెండు పార్టీల్లోనూ ఉత్కంఠ చోటు చేసుకుంది.మహిళలు అధికార పార్టీ పథకాలకు ఆకర్షితులయ్యారా? లేక ఎన్నికల మెనిఫేస్టోలో పొందుపరచిన 'సూపర్ సిక్స్'కు పట్టం కట్టారా? అనేది పార్టీ వర్గాల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది.ఈ సస్పెన్స్ తేట తెల్లం కావాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.




**తిరుపతిలో ఓటు హక్కు వినియోగించుకున్న సుగణమ్మ, అభినయ్‌రెడ్డి**

## కేవీబీ పురంలో 90 శాతం పోలింగ్ నమోదు

**కేవీబీ పురం, మే 13 ప్రభాతవార్త:**

కేవీబీపురం మండలంలో 44 బూత్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. అప్పటికే 90 శాతం మండలంలో ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. ప్రతి బూతులోకూడా 6 గంటల తరువాత పోలింగ్ బూతులోనే నిలబడి పోయారు. ప్రతి బూతులోకూడా 200 మంది ఓటర్లు తమ ఓట్లు వేయడానికి పోలింగ్ బూతుల్లోని నిలబడ్డారు. ఎన్నికలు నియమా నిబంధనలు ప్రకారం 6 గంటల తరువాత పోలింగ్ బూతులో ఉంటే వారిని ఓట్లు వేయించడానికి అనుమతి ఉంది కాబట్టి 7,8 గంటలైనా ఓట్లు వేపిస్తామని పోలింగ్ అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం కేవీబీ పురం, పెరిందేశం, రాగిగుంట గ్రామాల్లో పోలింగ్ బూతుల వద్దకు చేరుకుని అక్కడ పరిస్థితిని సమీక్షచేశారు. అందరికి తాగునీటిసదుపాయాలు కల్పించాలని అధికారులను సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, తిమ్మ సముద్రం, కాట్రపల్లి, ఎంఏ రాజులకండ్రిగ, నాయుడు గుంట, సదాశివపురం,ఏసీ కండ్రిగగ్రామాల్లో బూతుల్లో చిన్నాచితక పోల్ చేసుకున్నారు. మండలంలో 90 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు.

## ప్రశాంత వాతావరణంలో పోలింగ్

### మండలంలో 90 శాతం పోలింగ్

**రామచంద్రాపురం, మే 13 ప్రభాతవార్త:**



రామచంద్రాపురం మండలంలో ప్రశాంత వాతరణంలో సోమవారం సాధారణ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికలలో 90 శాతం పోలింగ్ జరిగినట్లు ఏఆర్ఓ ఉషారాణి తెలిపారు. ఉదయం నెత్తకుప్పం, కమ్మకండ్రిగ, నెన్నూరు పోలింగ్ కేంద్రాలలో ఈవియంలు మొరాయించ ంటంతో 30 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమయ్యింది. దీంతో అప్పటికే క్యూలైన్లలో నిలుచుకుని వున్న ఓటర్లు తోపులాటల నడుమ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాగా అనుప్పల్లి, సి.కె.పల్లి, బొప్పరాజుపల్లి, నూతుగుంట పల్లి, సి.రామాపురం, పోలింగ్ కేంద్రాలలో చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ ప్రకియ ముగిసింది.

## ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారు

### –టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి

**తిరుపతిరూరల్, మే 13 ప్రభాతవార్త:**



ప్రజలు రాజకీయంగా మార్పు కోరుకొంటున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం డాలర్స్ దివాకర్‌రెడ్డి దంపతులు స్వగ్రామమైన పెరుమాళ్ళపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయం నుండి ప్రజలు స్వచ్ఛంధంగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొంటున్నారని తెలిపారు, మార్పుకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, రాబోయేది కూటమి ప్రజా ప్రభుత్వమేనని, చంద్రబాబునాయుడుకి గిఫ్ట్‌గా చంద్రగిరి, శ్రీకాళహస్తి అసెంబ్లీలు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరగాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు.

## అధిక శాతం ఓటు హక్కును వినియోగించుకున్న మహిళలు

**తిరుపతిరూరల్, మే 13 ప్రభాతవార్త:**



సార్వత్రిక ఎన్నికలలో అధికశాతంలో మహిళలు ఓటు హక్కును వినియోగించు కున్నారు. సోమవారం ఉదయం నుండి మహిళలు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో మహిళలలో చైతన్యం వచ్చినట్లే బాహాబాహి కన్పిస్తుంది. ఒకప్పుడు వంటగదికే పరిమితమయ్యే మహిళలు ఎండను సైతం లెక్క చేయకుండా క్యూలైన్లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్‌లో యువత, వృద్ధులు పెద్దగా ఓటు హక్కును వినియోగించుకున్నట్లుగా అనవాలు కనబడలేదు. అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారా! లేక ప్రభుత్వంపై వ్యతిరేఖతతో ఓటు వేయటానికి సంసిద్దులైయ్యారా! అనే విషయాలు ప్రశ్నార్థకం.

## ఊరందూరులో ఓటు హక్కు వినియోగించుకున్న సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి రూరల్,మే 13 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో తెలుగుదేశం అభ్యర్థి బొజ్జలసుధీ ర్‌రెడ్డి తన సతీమణిరిషితారెడ్డిలు కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఉదయం నుంచి గ్రామంలో ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించు కున్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకు భానుడి దెబ్బకు భయపడి సూర్యోదయానికి ముందే పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. ప్రతి గ్రామంలోనూ మహిళా, పురుష ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకు బారులు తీరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటు వేయటానికి ప్రజలు స్వచ్ఛందంగా హాజరయ్యారు. ముఖ్యంగా మండలంలోని ఊరందూరు, అమ్మపాళెం,బివి పాళెం,గొల్లపల్లి, మన్నవరం,ఎంపేడు,ముచ్చివోలు గ్రామాల్లో భారీ ఎత్తున ఓటర్లు లెక్క చేయక హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం సమయంలో కూడా ఓటర్లు బూత్‌ల వద్దనే నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు.సాయంత్రం 6గంటలు దాటిన తరువాత కూడా గ్రామాల్లో క్యూలైన్లలో ఓటర్లు కనబడ్డారు. అయితే సమస్యాత్మక గ్రామాల్లో మాత్రం పోలీసులు బారీ బందోబస్తును, సాయుధ పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేసారు. అయితే పోలింగ్ తరువాత ఎవరికి వారు విజయం తమదే అని ప్రకటించుకున్నారు.

## తొట్టంబేడు మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు

### –భారీగా పోలీసు బందోబస్తు

**తొట్టంబేడు, మే 13 ప్రభాతవార్త**



తొట్టంబేడు మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు యువత, మహిళలు, వృద్ధులు చేరుకుని బారులు తీరడం కనిపించింది.మండలంలో మొత్తం 45 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఓటర్లు మొత్తం 33,397మంది ఉన్నారు. వీరిలో 16,134మంది పురుషులు, మహిళలు 17,263మంది ఓటర్లు ఉన్నారు. మండలంలోని కొత్తకండ్రిగ, జ్ఞానమ్మకండ్రిగ, పెద్దకనపర్తి, చిన్నకనపర్తి, శేషమనాయుడుకండ్రిగ,కాసరం, పిల్లమేడు, చిట్టత్తూరు, శివనాధపాళెం, చిట్టత్తూరు కొత్తకండ్రిగ, కంచనపల్లి, బోనుపల్లి, విరూపాక్షపురం, గుండేలిగుంట, బోనుపల్లి, సాంబయ్యపాళెం, తొట్టంబేడు, బసవయ్యపాళెం, కొండ్రాజుపల్లి, కొణతనేరి తదితర గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్రబలగాలు, స్థానిక పోలీసులు, సిఆర్‌పిఎఫ్, తమిళనాడు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో ఎన్నికలు ప్రశాతంగా ముగిసాయి. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర ఎప్పటికప్పుడు అన్ని ప్రాంతాలను పర్యవేక్షిస్తూ పర్యవేక్షణ చేశారు. ఏది ఏమైనా తొట్టంబేడు మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. అయితే శివనాథపాళెం, చిట్టత్తూరు గ్రామాల్లో రాత్రి 8గంటల వరకు పోలింగ్ కొనసాగింది. చిట్టత్తూరు గ్రామంలో పోలింగ్ కేంద్రంలో పవిత్రారెడ్డి పోలింగ్ ఏజెంట్లు ఎక్కడ కూర్చోవాలంటూ ప్రశ్నించడంతో వాగ్వివాదం తలెత్తింది. దీంతో పోలింగ్ సిబ్బంది సర్దిచెప్పి పంపడం జరిగింది.

## చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్

### ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు, చంద్రగిరి మండలంలో 75 శాతం పోలింగ్
### 6 గంటలకే పోలింగ్ కేంద్రాల బారులు తీరిన ఓటర్లు, ఏఆర్ఓ మారుతి

**చంద్రగిరి, మే 13 ప్రభాతవార్త:**



చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతం వాతావరణంలో చంద్రగిరి మండలంలో సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఏఆర్ఓ మారుతి తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని 58 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ అధికారులకు తగిన సూచనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఏ అభ్యర్థి కె.పి.వాసు (శ్రీనివాసులు), మాజీ మంత్రి గల్లా అరుణకుమారి చంద్రగిరిలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారనీ, అదేవిధంగా సినీనటులు మంచు మోహన్‌బాబు, మంచు విష్ణువర్ధన్ ఏ.రంగంపేటలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ ఎన్నికలలో పలువురు ప్రత్యేక ప్రతిభావంతులు, అనారోగ్యంతో భాధపడుతున్న వృద్ధులు సైతం వీల్‌చైర్స్ ద్వారా పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటువేయడం శుభపరిణామమన్నారు. ఈ ఎన్నికలలో పోలింగ్ సందర్భంగా ఓటర్లు ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని బారులుతీరడం ప్రజల్లో పెంపొందిన చైతన్యానికి ప్రతీకగా అభివర్ణించారు. చంద్రగిరి, శేషాపురం పోలింగ్ కేంద్రాలలో వైసిపి, టిడిపి వర్గాల మధ్యన వాగ్వివాదం, తోపులాటలు చోటుచేసుకున్నప్పటికీ పోలీసులు అదుపుచేసినట్లు తెలిపారు. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయం 6 గంటలకు మండలంలో మొత్తం 48,464 మంది ఓటర్లకు గానూ 75 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. అయితే పనపాకం, చిన్నరామాపురం పంచాయతీలలో పోలింగ్ కొనసాగుతున్నట్లు తెలిపారు. కాగా మధ్యాహ్నంపైన పోలింగ్ సరళి ఒక్కసారిగా మందగించింది.

# తిరుపతి డివిజన్

## స్ట్రెచర్ మీద వచ్చి ఓటు వేశాడు...!

### రామచంద్ర ఓటర్లకు ఆదర్శం

**తిరుచానూరు, మే 13 ప్రభాతవార్త:**



తిరుచానూరు గ్రామానికి చెందిన 87 సంవత్సరాల రామచంద్ర అనే ఓటరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇతర కారణాల రీత్యా హోమ్ ఓటింగ్ విధా నం ఉపయోగించుకోకపోయిన కుటుంబ సభ్యుల సహకారంతో ఓటు వేయ దానికి పోలింగ్ కేంద్రంకు వచ్చి ఓటు వేశారు. ఆరోగ్యం సహరించడం లేదని ఎండలోవెళ్ళడం మంచిది కాదని కుటుంబ సభ్యులు ఎంత వారించిన ససేమిరా అని ఓటు వేయకపోతే బతికి ఏమీ ప్రయోజనం అని రామచంద్ర స్ట్రెచర్ మీద పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశారు. రామచంద్ర కోట్లాది మంది ఓటర్లకు ఆదర్శమని పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లు వాఖ్యానించారు. ఇలాంటి వారు ఉండడం వల్లనే సమాజంలో ఇంకా నిజాయితీ ఉందని, తమ ఓటు ద్వారా మంచి ప్రభుత్వాన్ని అవకాశం ఉందంటున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**పుత్తూరురూరల్, మే 13 ప్రభాతవార్త:**



పుత్తూరు మండల పరిధిలో సోమవారం ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. మండుటెండను కూడా లెక్కచేయకుండా మహిళలు వృద్ధులు పెద్దసంఖ్యలో తమ ఓటును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. వేపగుంట,తిరుమలకుప్పం,కేవీఆర్‌పురం గ్రామాల్లో ఈవీఎంలు కొంత ఇబ్బంది పెట్టాయి. వృద్ధులు దివ్యాంగులు మండుటెండలోవచ్చి ఓట్లు వేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తగు చర్యలు చేపట్టారు.

## హంస వాహనంపై శ్రీ కామాక్షిదేవి

**పుత్తూరురూరల్, మే 13 ప్రభాతవార్త:**



స్థానిక శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి, అమ్మవారు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.ఉదయంఆలయంలోని ఉత్సవవిగ్రహాలకు ప్రత్యేక అభిషే కాలు, అలంకరణలు చేశారు. రాత్రి వైభవంగా మంగళవాయిద్యాల నడుమ విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా అలంకరించి స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూరహారతులు ఇచ్చి పూజలు చేశారు.

## ఏర్పేడు మండలంలో సజావుగా సాగిన ఎన్నికలు

**ఏర్పేడు, మే13, ప్రభాతవార్త**



మండలంలోని 40 పంచాయతీల్లో సోమవారం అసెంబ్లీ, లోకసభ స్థానాలకు జరిగిన సార్వత్రిక ఎన్నికలు చిన్నచిన్న చెదురుమదురు సంఘటనల తప్ప ఎలాంటి ఘర్షనలకు తావు లేకుండా, సజావుగా పోలింగ్ జరిగింది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు క్యూలో నిలబడ్డ ఓటర్లు అందరికి పోలింగ్ సిబ్బంది టోకెన్లు ఇచ్చి సమయం మించినా వారందరికి ఓటు వినియోగం కల్పించారు. చిందేపల్లి, రావిళ్లవారికండ్రిగ, గుండ్లకండ్రిగ, పంగూరు కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో చాలా సెంటర్ల దగ్గర ఓటర్లు బారులు తీరి కన్పించారు. ఇక తిరుపతి ఎంపీ అభ్యర్థి ఎం. గురుమూర్తి తన సతీమణి నవ్యశ్రీతో కలసి తన సొంత గ్రామమైన మన్నసముద్రంలో తన ఓటును వినియోగించుకున్నారు, అదేవిదంగా తిరుపతి ఐఐటి డైరెక్టర్ కెవిన్ సత్యనారాయణ దంపతులు ఆమందూరు పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిదంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పోతుగుంట రాజేష్ నాయుడు మర్రిమంద పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలించారు. వృద్ధులు, నడవలేని వారిని వీల్ చైర్‌లో పోలింగ్ కేంద్రాలకు తరలించి వారి ఓటు వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అదేవిదంగా మడిబాక పంచాయతీలో చెంచమ్మ అనే వృద్ధురాలిని వారి బందువు ఓటు వేసేందుకు చేతులపై తీసుకెళ్లి ఓటు వేయించారు.

## వడమాలపేటలో ప్రశాంతంగా పోలింగ్

**వడమాలపేట, మే 13 ప్రభాతవార్త:**



వడమాలపేట మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 24998 ఓట్లు ఉండగా అందులో పురుషులు 11999, మహిళలు 12994 మంది ఓటర్లు కాగా మండలంలో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వడమాలపేటలోని 11వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మండుటెండలను సహితం లెక్కచేయకుండా ప్రజలు క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిర్ణీత సమయానికి 76.8 శాతం ఓట్లు పోలు కాగా వడమాలపేటలోని రెండు కేంద్రాలు, ఓబీఆర్ కండ్రిగ, పత్తిపుత్తూరు, అప్పలాయగుంట, శ్రీ బొమ్మరాజపురం, సీతారామపురంలో ఓటర్లు క్యూలైన్లలో ఉండడంతో పోలింగ్‌ను కొనసాగించారు. నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఉదయం, వైసీపీ అభ్యర్థి మంత్రి రోజా సాయంత్రం వడమాలపేట మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

## ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

**విజయపురం, మే 13 ప్రభాతవార్త:**



మండలంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 29 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని పన్నూరు, శ్రీహరిపురం, జీఎం పురం, ఎం అగరంలో చెదురుముదురు సంఘటనలు చోటు చేసుకోవడంతో పోలీసులు చెల్లాచెదరు చేశారు. మండలంలోని కోసల నగరం, కొత్త ఇళ్ళత్తూరు పోలింగ్‌కేంద్రంలో ఉదయం ఈవీఎం రెండు గంటల పాటు మొరాయించింది. మండలంలోని కేవీ పురం, కాళికాపురం, మాధవరం పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 7.30 గంటల వరకు ఎన్నికలు జరిగింది. ఎన్నికల సరళిని రూట్ ఆఫీసర్లు, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ జయప్ప, టీడీపీ, వైసీపీ ఎన్నికల పరిశీలకులు పాల్గొన్నారు. సిద్ధార్థ గ్రూపు విద్యాసంస్థల చైర్మన్‌కొండూరు అశోకరాజు, విజయపురంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## నగరిలో ప్రశాంతంగా పోలింగ్

**పుత్తూరు, మే 13 ప్రభాతవార్త :**

చిన్న చిన్న వాగ్వివాదాలు, కొన్ని చోట్ల ఇవిఎం యంత్రాలు మొరాయింపు మినహా నగరి నియోజకవర్గంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటికీ చాలా కేంద్రాల వద్ద ఓటర్లు ఉదయం ఆరు గంటలకే బారులు తీరారు. అయితే కొన్ని చోట్ల ఇవిఎం యంత్రాలు మొరాయించడంతో అక్కడ వున్న సిబ్బంది వాటిని వెంటనే మరమ్మతు చేశారు. దీని వల్ల కొన్ని కేంద్రాల వద్ద అరగంట, గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా ఓటర్లు క్యూల్లో నిలబడి ఓట్లు వేశారు. నియోజకవర్గం మొత్తం మీద ఉదయం తొమ్మిది గంటలకు 12.6 శాతం, 11 గంటలకు 28.77, ఒంటి గంటకు 43.12, మూడు గంటలకు 61.93, అయిదు గంటలకు 76.80 శాతం ఓటింగ్ నమోదైంది. అయితే ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగిసినప్పటికీ, కొన్ని కేంద్రాల్లో అప్పటికే క్యూలో వున్న ఓటర్లకు అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఇచ్చారు. దాంతో తొమ్మిది గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. ఏడున్నర గంటలకు సుమారు 82 శాతం పోలింగ్ నమోదైంది.

**రాత్రి 9.00 గంటల వరకూ పోలింగ్**

నియోజకవర్గంలోని అయిదు మండలాల్లోనూ కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి తొమ్మిది వరకూ పోలింగ్ కొనసాగింది. వడమాలపేట మండలంలో పత్తిపుత్తూరు, అప్లాయిగుంట, సీతారామపురం, పుత్తూరు మండలంలో కొత్త తిమ్మాపురం, కె.బి.ఆర్.పురం, ఎగువ కనకంపాలెం, పాత పల్లూరు, నగరి మండలంలో కృష్ణరామాపురం, ఏకాంబరకుప్పం, వి.కె.ఆర్.పురం, నింద్ర మండలంలో నింద్ర, అగరం, ఒరూరుపేట, విజయపురం మండలంలో మాధవరం, కోసలనగరం, పన్నూరు, జగన్నాధపురం, ఇల్లత్తూరు, విజయపురం పోలింగ్ కేంద్రాల్లో రాత్రి తొమ్మిది వరకూ పోలింగ్ జరిగింది.

## యువతలో ఓటు చైతన్యం

**తిరుపతి, మే 13ప్రభాతవార్త:**



యువ ఓటర్లలో ఈ సారి ఓటుచైతన్యం కనిపించింది. తిరుపతి అసెంబ్లీలో కొత్తగా 6వేలమందికిపైగా 18-19ఏళ్ళ యువత తమ ఓటు హక్కు నమోదు చేసుకోవడం, ఓటు వేసేందుకు రావడం, సోమవారం జరిగిన ఓటింగ్‌లో ఎంతో ఆసక్తిగా పాల్గొని తొలిసారి ఓటు వేసి అనుభూతి చెందారు. వేలూరు విట్ కళాశాలలో బిబిఏ చదువుతున్న గుండాల సరయు మొదటిసారిగా తన ఓటు వేసి యువతకు స్ఫూర్తిగా నిలిచింది.

# చెదురు ముదురు సంఘటనల నడమ పోలింగ్

**-మొరాయించిన ఇవిఎంలు.. పలుచోట్ల ఆలస్యంగా పోలింగ్ మొదలు !! - ఎండ ధాటికి మధ్యాహ్నం ఖాళీ.. సాయంత్రం నుంచి మరలా ఓటర్లు బారులు !!**


కుప్పంలో బారులు తీరిన ఓటర్లు

కుప్పం, మే 13 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో సోమవారం చెదురుముదురు సంఘటనలు, పలుచోట్ల తోపులాటల మధ్య ఎన్నికలు ముగిశాయి. సాయంత్రం 7గంటల దాకా నియోజకవర్గంలో 79శాతం మేర ఓట్లు పోలయ్యాయని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. రాత్రి 11.30గంటల ప్రాంతంలో పోలింగ్ పూరైంది. ఉదయం 5.30 గంటలకు ఎన్నికల అధికారులు మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం 7 గంటల నుంచి పోలింగ్ మొదలు కాగా పెద్దఎత్తున ఓటర్లు బారులు తీరారు. అయితే పలు చోట్ల ఈవిఎం యంత్రాలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. కుప్పం పట్టణం, తంబిగానిపల్లి పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎం యంత్రాలు మొరాయించాయి. దీంతో ఓటర్లు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు మధ్యాహ్నం 12.30గంటల కల్లా తగ్గ్గిపోయారు. ఎండ ధాటికి పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక ఖాళీగా కన్పించాయి. మధ్యాహ్నం ఒంటిగంటకు కుప్పం నియోజకవర్గంలో 43.29శాతం మేర ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 5గంటలకు 75శాతం పోలింగ్ జరిగింది. 6 గంటలకు ఓటర్లు లేని పోలింగ్ బూత్‌ల్లో అధికారులు ఓటింగ్ ప్రకియను నిలిపేశారు. ఎన్నికలు ముగిసిన అనంతరం పోలింగ్ సిబ్బంది పోలీసుల కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవిఎం యంత్రాలను, వివి ప్యాట్‌లను కుప్పం ఎంఎఫ్‌సీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు అంతంతమాత్రంగానే కన్పించింది. రాజకీయ పక్షాల నేతలు పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్లలోపే ఓట్లను అభ్యర్థిస్తూ కన్పించారు. పట్టణంలో వృద్ధులు, వికలాంగులు సైతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రాత్రి 7 గంటలు దాటినా ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడంతో అధికారులు ఓటు వేసేందుకు అనుమతించారు. ఎస్పీ సరిత, ట్రైనీ ఐపిఎస్‌లు, డిఎస్పీ శ్రీనాథ్‌లు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, వైకాపా అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌లు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించి ఎన్నికల సరళిని పరిశీలించారు.

**కుప్పంరూరల్ :** మండలంలో స్వల్ప ఉద్రిక్తతల మధ్య ఎన్నికలు ముగిశాయి. దేవరాజపురంలో వైకాపా, దేశం శ్రేణుల మధ్య వాగ్వివాదం జరగ్గా పోలీసులు చెదరగొట్టారు. అలాగే నూలుకుంట గ్రామంలో చంద్రబాబుకు జై అంటున్న దేశం శ్రేణులపై వైకాపా శ్రేణులు కూల్ డ్రింక్‌లు మీదజల్లి దాడులకు దిగారు. సోము అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మంకలదొడ్డిలో ఇవిఎం యంత్రాలు మొరాయించడంతో చీకటి పడ్డా కూడా ఓటర్లు బారులు తీరి కన్పించారు. లక్ష్మీపురంలో గాయత్రి అనే మహిళ ఓటు ఇతరులు ఎవరో వేయడంతో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**శాంతిపురం :** శాంతిపురం మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పలు పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎం యంత్రాలు మొరాయించడంతో పోలింగ్ కొంత ఆలస్యంగా మొదలైంది. మండలంలోని గుంజార్లపల్లి పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల గోపి తన ఓటు హక్కు వినియోగించుకోగా వెంకటేపల్లిలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఒకటి రెండు చోట్ల వైకాపా, దేశం శ్రేణుల మధ్య స్వల్ప వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయి.

రామకుప్పం : మండలంలో స్వల్ప ఉద్రిక్తతల నడమ సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. మిట్టపల్లి, విజలాపురంలలో ఇవిఎం యంత్రాలు మొరాయించడంతో పోలింగ్ 8.30గంటలకు మొదలైంది. ననియాలలో వైకాపా అభ్యర్థి భరత్ వాహనంకు టిడిపి కార్యకర్తలు అడ్డుగా ఉన్నారని ఎమ్మెల్సీ భరత్ గన్‌మెన్ దేశం శ్రేణుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాలు మోహరించగా ఎస్పై వారిని చెదరగొట్టి పంపించేశారు. దీనిపై దేశం శ్రేణులు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సింగసముద్రంలో తెదేపా ఏజెంట్లు బూత్‌లో ప్రచారం చేస్తున్నారని వైకాపా శ్రేణులు ఆందోళనకు దిగారు. దేశం, వైకాపా శ్రేణుల మధ్య దాడులు జరిగాయి. సుబ్రమణ్యం, శ్రీనివాసులు, వడివేలు అనే వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. కేంద్ర, స్థానిక బలగాలు ఆందోళన కారులను చెదరగొట్టారు. పంద్యాలమడుగు, గౌరివిమాకులపల్లి, ఆరిమానుపెంట, పంద్యాలమడుగు, బందార్లపల్లి గ్రామాల్లో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. ఎట్టకేలకు ఎన్నికలు ముగిశాయి.

# పలమనేరులో ప్రశాంతంగా పోలింగ్

**-ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు -పెద్దపంజాణిలో మురాయించిన ఈవిఎం**


ఓటు హక్కు వినియోగించుకున్న టిడిపి అభ్యర్థి అమరనాథరెడ్డి


ఓటు హక్కు వినియోగించుకున్న వైకాపా అభ్యర్థి వెంకటౌగౌడ్

పలమనేరు, మే 13, ప్రభాతవార్త: పలమనేరునియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ ముగిసింది. పోలీసులు 288 పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆర్‌ఓ మనోజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టా ల్సిన చర్యలను రెవెన్యూ అధికారులు పర్యవేక్షణలో చేపట్టారు. ఉదయం నుండి ఓటర్లు పోలింగ్‌కేంద్రాల వద్ద బారులు తీరారు. నియోజకవర్గంలోని పలమ నేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వి.కోటలలో ప్రశాంతంగా పోలింగ్ జరి గింది. నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు గ్రామాలలో ఇరు పార్టీ నేతల మధ్య స్వల్పపాటి ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వారిని పోలింగ్ కేంద్రాల వద్ద నుండి పంపివేశారు. వైకాపా, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులు నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరి శీలించారు. పలమనేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులు వారి స్వగ్రామాలలో ఓటును వినియోగించు కున్నారు. వైకాపా అభ్యర్థి డా. వెంకటేగౌడా ఆయన సతీమణి వి. కోట మండలంతోటకనుమలో వారి ఓటును వినియోగించు కున్నారు. పెద్ద పంజాణి మండలం కెళవాతిలో టిడిపి అభ్యర్థి అమరనాథరెడ్డి ఆయన సతీ మణి, కుమారుడు వారిఓటును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ గంగవరంలో ఆయన ఓటును వినియోగిం చుకున్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులువి. కోటలోనిఆయన స్వగ్రామంలో ఓటును వినియోగించుకున్నారు. పలమనేరు ఆర్‌డిఓ, ఆర్‌ఓ మనోజ్‌కుమార్‌రెడ్డి గంగవరం మండలంలోని 88వ పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటును వినియోగించుకున్నారు.


ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


చంద్రగిరిలో ఓటు హక్కు వినియోగించుకున్న గల్లా అరుణకుమారి మరియు టిడిపి నాయకులు


చంద్రగిరి నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న నటులు మోహన్‌బాబు, తనయుడు మంచు విష్ణు

## యర్రాతివారిపల్లెలో ఓటు వేసిన పెద్దిరెడ్డి కుటుంబం



సదుం మే 13 ప్రభాతవార్త : సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ఆయన కుటుంబ సభ్యులు స్వగ్రామం యర్రాతివారిపల్లెలోని పోలింగ్‌కేంద్రం లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణమ్మ, ఆయన తల్లి పద్మావతమ్మ, జడ్పీమాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహా మండలిసభ్యులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డివేణు గోపాల్‌రెడ్డిలు ఉదయం 7 గంటలకే కేంద్రం వద్దకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగాసదుం, బూరగమంద, నడిగడ్డ, తిమ్మానా యనపల్లె పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలు ఉదయం నుంచి ఓటర్లతో కిక్కిరిసిపోయాయి. అధికసంఖ్యలోమహిళలు తరలి వచ్చారు. నడిగడ్డ, గొంగివారి పల్లెల్లోదివ్యాంగులుఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా, తిమ్మానాయన పల్లెలో అగ్రహారానికి చెందిన చెరకు రమాదేవమ్మ అనే 90 ఏళ్ల వృద్ధురాలు ఓటు వేశారు.

## ఫ్యాన్ గాలికి... సైకిల్ పటాపంచల్ : మధుసూధనరెడ్డి




శ్రీకాళహస్తిరూరల్, మే 13 ప్రభాతవార్త : రాష్ట్రంలోనూ, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఫ్యాన్‌గాలికి సైకిల్ పటాపంచల్ అని వైకాపా అభ్యర్థి, శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని పోలింగ్ సరళిని మధుసూధనరెడ్డి సోమవారం పరిశీలించారు. ఉదయం నుంచి ఆయన పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళి పరిస్థితి సమీక్షించారు. ఈ నేపధ్యంలో ఆయన మండలంలోని ముచ్చివోలు, ఎంపేడు, పోలి పంచాయతీల్లో పరిశీలించారు. ఊరందూరు గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ గతంలో ఫ్యాన్ నాలుగులో పెడితే తనకు 40వేల మెజారిటి వచ్చింది. ఒక పాయింట్ పెంచాము. ఈ సారి 50వేల మెజారిటితో గెలవబోతున్నామని వివరించారు. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని ఊరందూరు గ్రామంలో కూడా తాము దేవాలయాలను అభివృద్ధి చేసాం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తున్నాము. అంతేకాక రాష్ట్రంలోనూ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మేము చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తించారు. అందుబాటులో ఉండే నాయకులకు అండగా ఉంటారు తప్ప స్తానికేతరులకు అవకాశం కల్పించరని ఈ ఎన్నికలు రుజువు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు.

## చక్రం తిప్పిన ఎస్ సి వి నాయుడు



శ్రీకాళహస్తి, మే 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలతో పాటు తొట్టంబేడు మండలంలోని తంగేళ్ళ పాళెం పంచాయతీలో సోమవారం జరిగిన ఎన్నికల్లో మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు తనదైన శైలిలో వ్యవహారించి చక్రం తిప్పారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళూరుపేట నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపుకు సంబంధించి తెలుగుదేశం అధినేత చంద్ర బాబు నాయుడు రేణిగుంట విమానాశ్రయంలో కలసి దిశ దెశ నిర్దేశం చేసారు. దాంతో ఎన్నికల సమయంలో తన చాణక్యతను ఎస్‌సివి నాయుడు ప్రదర్శించారని చెప్పవచ్చు. ముఖ్యంగా సత్యవేడు నియోజకవర్గంలో తిమ్మిని బొమ్మిని చేసారని చెప్పవచ్చు.. ముఖ్యంగా బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్య పాళెం, సత్యవేడు మండలాల్లో అసంతృప్తి వాదులను ఒకే తాటిపై తీసుకురావటానికి ఎస్‌సివి నాయుడు మూడు రోజులుగా పట్టుబట్టి పంచాయతీ జరిపి ఏక తాటిపై తెచ్చారు. గ్రామాల్లో తన అనుయాయులను చైతన్య పరచారు. సోమవారం ప్రతి పోలింగ్ బూత్ వద్దకు వెళ్ళి పరిస్థితిని పరిశీలించారు. ఎక్కడ ఇబ్బంది ఉందో అక్కడ సర్దుబాటు చేసారు. తెలుగుదేశం అభ్యర్థి కోనేటి ఆదిమూలంకు అనుకూలంగా మలచుకొనుటకు చక్రం తిప్పారు. కాగా సూళూరుపేట నియోజకవర్గంలోని పెళ్ళకూరు మండలంలోని ఓ బలమైన వైకాపా వర్గం నాయకులు తన ముఖ్యఅనుచరులుగా ఉన్నారు. అయితే వారిని కూడా పక్కన పెట్టి తన వర్గీయులతో తెలుగుదేశం పార్టీకి అధిక శాతం ఓట్లు పడేటట్లు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల్లో సీనియర్‌గా ఉన్న ఎస్‌సివి నాయుడు తనదైన శైలిలో చక్రం తిప్పి తన సత్తాఏమిటో చాటుకున్నారు.

## టిడిపి ఎంపి అభ్యర్థి దగ్గుమల్ల ప్రసారావు పరిశీలన



చంద్రగిరి, మే 13 ప్రభాతవార్త: టిడిపి ఎంపి అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాదరావు చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిని గమనించిన ఆయన పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా ఎంఎల్‌ఏ తనయుడు వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన అప్పటి వరకు జరిగిన పోలింగ్ శాతాన్ని వివరించారు.

**-టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ పరిశీలన**

చంద్రగిరి పోలింగ్ కేంద్రాలలో మధ్యాహ్నం వరకు జరిఒగిన పోలింగ్ సరళి పట్ల ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేయగా, టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నాని తనయుడు, టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు పోలింగ్ సరళిని వివరించి, అప్పటి వరకు పోల్ అయిన శాతాన్ని వివరించారు.


శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్న సుధీర్‌రెడ్డి


పాకాలలో ఓటు హక్కును వినియోగించుకున్న చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి


తిరుపతిరూరల్ తుమ్మలగుంటలో ఓటు హక్కును వినియోగించుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి


తుమ్మలగుంటలో ఓటు హక్కును వినియోగించుకున్న చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి


మన్నసముద్రం పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న వైసిపి ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి దంపతులు


తిరుపతి అక్కారంపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న అతిథిసింగ్


ఓటు హక్కును వినియోగించుకొంటున్న జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు


ఓటు హక్కును వినియోగించుకొన్న వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి


ఓటు హక్కును వినియోగించుకొన్న తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడు దంపతులు


ఓటు హక్కును వినియోగించుకొన్న నగరి తెలుగుదేశం అభ్యర్థి గాలి భానుప్రకాష్


కుప్పం పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీలు భరత్, డా॥ కంచర్ల శ్రీకాంత్


ౖఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న శ్రీకాళహస్తి వైకాపా అభ్యర్థి బియ్యపు దంపతులు


శ్రీకాళహస్తి టిడిపి నేత ఎస్‌సివినాయుడు


శ్రీకాళహస్తి కాంగ్రెస్ అభ్యర్థి రాజేష్‌నాయుడు